పుష్కర పరాజయం

12 ఏండ్ల తర్వాత భారత్‌కు సిరీస్ ఓటమి

రెండో టెస్టులో కివీస్ చారిత్రక విజయం • భారత్‌లో తొలి టెస్టు సిరీస్ సొంతం • సాంట్నర్ ఐదు వికెట్లతో విజృంభణ

భారత్‌కు భంగపాటు! సొంతగడ్డపై తమకు తిరుగులేదనుకున్న టీమ్‌ఇండియాకు ఊహించని రీతిలో చుక్కెదురైంది. బెంగళూరు ఓటమిని మరిపిస్తూ పుణెలో సిరీస్‌ను సమం చేస్తారనుకున్న మనోళ్లు అన్నింటా విఫలమై ఘోర అపజయాన్ని మూటగట్టుకున్నారు. గత కొన్నేండ్లుగా అప్రతిహత విజయాలతో వరుసగా 18 సిరీస్‌లతో దూసుకెళుతున్న టీమ్‌ఇండియాకు న్యూజిలాండ్ బ్రేక్ వేసింది. సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ పుణె టెస్టులో కివీస్ విజయదుందుభి మోగించింది. సాంట్నర్ ఆరు వికెట్ల విజృంభణతో రోహిత్‌సేన కుప్పకూలింది. జైస్వాల్, జడేజా అంతోఇంతో పోరాడినా..మిగతా వాళ్లు బ్యాట్లు ఎత్తేయడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా పుష్కరం (12 ఏండ్ల) తర్వాత భారత్‌కు సిరీస్ పరాజయం ఎదురైతే..దాదాపు 70 ఏండ్ల తర్వాత కివీస్ తొలిసారి చారిత్రక టెస్టు సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుని కొత్త చరిత్ర లిఖించింది. ఇన్నేండ్లుగా సాధ్యం కాని అరుదైన రికార్డును కివీస్ సొంతం చేసుకుంది.

క్లోస్లో (17)

పుణె: భారత్‌కు ఘోర పరాభవం. తమ స్పిన్ తంత్రంతో దశాబ్దాలుగా ప్రత్యర్థి జట్లపై అసమాన విజయాలతో దూసుకెళుతున్న టీమ్‌ఇండియా దుర్భేద్యమైన కోటకు బీటలు పడ్డాయి. కొరకరాని కొయ్యగా, తీరని కలగా మిగిలిన భారత్‌లో భారత్‌పై టెస్టు సిరీస్ విజయాన్ని న్యూజిలాండ్ ఇన్నేండ్లకు సాకారం చేసుకుంది. ముచ్చటగా మూడు రోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో కివీస్ 113 పరుగుల తేడాతో భారత్‌పై చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. తద్వారా 1955 నుంచి భారత్‌లో పర్యటిస్తున్న కివీస్ తొలిసారి టెస్టు సిరీస్ విజయాన్ని ముద్దాడింది. కివీస్ నిర్దేశించిన 359 పరుగుల లక్ష్యఛేదనలో భారత్..245 పరుగులకు పరిమితమైంది. స్టార్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్(6/104) ధాటికి టీమ్‌ఇండియా బ్యాటర్లు కుదేలయ్యారు. యశస్వి జైస్వాల్(77), జడేజా(42) మినహా మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్..255 పరుగులకు ఆలౌటైంది. సుందర్(4/56), జడేజా(3/72), అశ్విన్(2/97) రాణించారు. ఫిలిప్స్(48 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 13 వికెట్లతో జట్టు చిరస్మరణీయ విజయంలో కీలకమైన సాంట్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య వచ్చే నెల 1 నుంచి ముంబైలో మూడో టెస్టు జరుగనుంది.

సాంట్నర్ (6/104)

సాంట్నర్ సిక్సర్:

కివీస్ లెఫ్టార్మ్ స్పిన్నర్ సాంట్నర్ మళ్లీ విజృంభించాడు. భారత స్పిన్నర్లు అంతగా ప్రభావం చూపని పిచ్‌పై సాంట్నర్ వికెట్ల వేట కొనసాగించాడు. తొలి ఇన్నింగ్స్ దూకుడుకు కొనసాగింపుగా సాంట్నర్ ఆరు వికెట్ల విజృంభణతో భారత్ ఓటమి వైపు నిలిచింది. నిర్దేశిత లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియాకు మెరుగైన శుభారంభం దక్కలేదు. కెప్టెన్ రోహిత్‌శర్మ(8) మరోమారు నిరాశపరిచాడు. జైస్వాల్, గిల్(23) ఇన్నింగ్స్‌ను గాడిలో పడేసే బాధ్యతను భుజానేసుకున్నారు. ముఖ్యంగా జైస్వాల్ మెరుగైన పరిణతి కనబరిచాడు. చక్కని ఆటతీరుతో కివీస్ బౌలర్లను ఎదుర్కొంటూ పరుగులు సాధించాడు. సాఫీగా సాగుతున్న ఇన్నింగ్స్ లోగిల్‌ను ఔట్ చేయడం ద్వారా సాంట్నర్..కివీస్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. లంచ్ విరామం వరకు 81/1తో మెరుగ్గా కనిపించిన టీమ్‌ఇండియా ఆ తర్వాత సాంట్నర్ స్పిన్ మాయాజాలంతో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. జైస్వాల్, పంత్(0), కోహ్లీ(17), సర్ఫరాజ్‌ఖాన్(9) తేలిపోయారు. సుందర్(21) ఉన్నంతలో ఆకట్టుకున్నాడు. ఆఖర్లో జడేజా, అశ్విన్(18) కివీస్‌ను నిలువరించేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. మొత్తంగా స్పిన్‌తో పడగొడుదామనుకున్న భారత్ అదే ఉచ్చులో చిక్కుకుని ఊహించని పరాజయాన్ని ఖాతాలో వేసుకుంది.

1

భారత్‌లో భారత్‌పై టెస్టు సిరీస్ గెలువడం కివీస్‌కు ఇది తొలిసారి. దీనికి ముందు భారత్‌పై రెండు టెస్టుల్లో (1969, 1988) మాత్రమే గెలిచింది.

స్వదేశంలో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన భారతబ్యాటర్‌గా జైస్వాల్ (1056) నిలిచాడు. విశ్వనాథ్(1047) రికార్డును జైస్వాల్ అధిగమించాడు.

3 స్వదేశంలో ఈ ఏడాది టెస్టుల్లో భారత్‌కు ఎదురైన ఓటములు. కివీస్‌పై రెండు, ఇంగ్లండ్‌పై ఒక ఓటమి ఎదుర్కొంది.

4 భారత కెప్టెన్‌గా రోహిత్‌శర్మ స్వదేశంలో నాలుగు టెస్టులు ఓడిపోయాడు. కపిల్‌దేవ్, అజారుద్దీన్ సరసన రోహిత్ నిలువగా, అలీ ఖాన్ పటౌడీ 9 ఓటములతో ముందున్నాడు.

18 న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు భారత్ వరుసగా 18 టెస్టు సిరీస్ విజయాలను సొంతం చేసుకుంది. చివరిసారి 2012లో ఇంగ్లండ్‌కు సిరీస్ చేజార్చుకుంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259, **భారత్ తొలి ఇన్నింగ్స్:** 156 ఆలౌట్, **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్:** 255 ఆలౌట్, **భారత్ రెండో ఇన్నింగ్స్:** 245 ఆలౌట్(జైస్వాల్ 77, జడేజా 42, సాంట్నర్ 6/104, ఫిలిప్స్ 2/43)

గోరఖ్‌పూర్(ఉత్తరప్రదేశ్) వేదికగా జరిగిన 25వ జాతీయ సబ్‌జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు రజతంతో పాటు రెండు కాంస్య పతకాలు సాధించింది.

కబడ్డీ సంఘంలో అక్రమాలపై పిటిషన్

ఎన్నికల నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, అక్టోబర్26(నమస్తే తెలంగాణ): తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. పిటిషనర్ అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని అసోసియేషన్‌తో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది తదుపరి విచారణ వాయిదా వేసింది. తెలంగాణ కబడ్డీ సంఘం కార్యవర్గానికి ఈ నెల 7న ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు బసాని హేమంత్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. అసోసియేషన్ ఎన్నికలను వాయిదా వేయాలన్న పిటిషనర్ వినతిని తోసిపుచ్చారు. ఎన్నికలు అక్రమ మార్గంలో జరిగాయని తేలితే ఫలితాలు వెలువడిన తర్వాతనైనా ఆ ఎన్నికలను రద్దు చేస్తామన్నారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్‌కు ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి.

పాక్‌దే సిరీస్

రావల్పిండి: సొంతగడ్డపై పాకిస్థాన్ దుమ్మురేపింది. స్పిన్నర్ల ఆధిపత్యం కొనసాగిన ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో పాక్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు టెస్టుల సిరీస్‌ను పాక్ 2-1తో కైవసం చేసుకుంది. ఇంగ్లండ్ నిర్దేశించిన 36 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని పాక్ 3.1 ఓవర్లలో వికెట్ కోల్పోయి ఛేదించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 24/3తో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్..112 పరుగులకు కుప్పకూలింది. స్పిన్నర్లు నోమన్ అలీ(6/42), సాజిద్ ఖాన్(4/69) ధాటికి ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. రూట్(33) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు.

టైటాన్స్ హ్యాట్రిక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో సీజన్లు మారుతున్నా..తెలుగు టైటాన్స్ తలరాత మాత్రం మారడం లేదు. శనివారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 37-41 తేడాతో దబాంగ్ ఢిల్లీ చేతిలో ఓటమి పాలైంది. ఇప్పటి వరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో టైటాన్స్ మూడు పరాజయాలు ఎదుర్కొంది. టైటాన్స్ జట్టులో స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ 18 పాయింట్లతో చెలరేగినా జట్టును గెలిపించలేకపోయాడు. మరోవైపు నవీన్‌కుమార్, అషు మాలిక్ 15 పాయింట్లతో ఢిల్లీ విజయంలో కీలక మయ్యారు. మ్యాచ్ ప్రథమార్ధంలో టైటాన్స్ దూకుడుగా ఆడినా..కీలక మైన ద్వితీయార్ధంలో ఢిల్లీ పుంజుకుని పోటీలోకి వచ్చింది.

భారత్‌కు కాంస్యం | సుల్తాన్ జోహర్ కప్

జోహర్ బహ్రు(మలేషియా): సుల్తాన్ జోహర్ కప్‌లో భారత యువ హాకీ జట్టు కాంస్య పతకం సొంతం చేసుకుంది. శనివారం జరిగిన వర్గీకరణ పోరులో భారత్ 3-2 (పెనాల్టీ షూటౌట్)తో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. మ్యాచ్ నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్స్ 2-2తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు పెనాల్టీ షూటౌట్ తప్పనిసరైంది. షూటౌట్‌లో గుర్జోత్‌సింగ్, మన్మీత్‌సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్స్ చేశారు. గోల్‌కీపర్ బిక్రమ్‌జీత్‌సింగ్..ప్రత్యర్థి స్ట్రైకర్ల గోల్స్‌కు అడ్డుగోడగా నిలిచాడు.

ఐటీఎఫ్ చాంప్ కార్తీక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐటీఎఫ్ టెన్నిస్ టోర్నీల్లో రాష్ట్ర యువ ప్లేయర్ హర్ష కార్తీక్ టైటిళ్ల జోరు కొనసాగుతున్నది. వరల్డ్ టెన్నిస్ టూర్‌లో భాగంగా ఇథియోపియాలో జరిగిన ఐటీఎఫ్ జూనియర్ టోర్నీలో కార్తీక టైటిల్ విజేతగా నిలిచింది. శనివారం జరిగిన బాలికల సింగిల్స్ ఫైనల్లో కార్తీక 6-4, 6-2తో బ్రూనా లియోటో(బ్రెజిల్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన కార్తీక..టోర్నీ మొత్తమ్మీద ఒక్క సెట్ కూడా ప్రత్యర్థికి చేజార్చుకోలేదు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.